# వైభవంగా ఆంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్టాపన

## పాల్గొన్న ఒక్కలిగ సంఘం అధ్యక్షుడు అనంతరాజు

అమరాపురం మే 9 ప్రభాతవార్త



స్వామివారి సేవలో ప్రముఖులు

మండల పరిధిలోని నడలుడం గ్రామం నందు ఆంజనేయ స్వామి నూతన దేవాలయం విగ్రహ పునప్రతిష్టాపన, శిఖర కలశ స్థాపన కార్యక్రమం శుక్రవారం వేద మంత్రోచ్ఛ రణల మధ్య వైభవంగా జరిగింది. వేద పండితులు విశేష పూజల అనంతరం నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నూతన దేవాలయానికి శిఖర ప్రతిష్టాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా మడకశిర నియోజకవర్గ ఒక్కలిగ సంఘం అధ్యక్షుడు బి.అనంతరాజు, అమరాపురం ఎంపీటీసీ నాగభూషణ్ వలస సర్పంచ్ నాగవేణి జితేంద్ర, నాగేంద్రప్ప, మాజీ జెడ్పిటిసి ఉగ్రప్ప, న్యాయవాది రంగనాథ్ ,కాంతరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతరాజు స్వామివారిసేవలో అనంతరం దేవాలయంఅద్భుతంగా నిర్మించారని, భక్తిభావాలద్వారా గ్రామాల్లో శాంతిచేకూరుతుందన్నారు. అనంతరం స్వామివారి సేవలో పాల్గొన్నారు. దేవాలయ నిర్మాణపు దాత చిత్రశేఖర్, శివరుద్రప్ప, నరసింహమూర్తి, విద్యసాగర్, నాగరాజు, శివకుమార్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు. విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నడలుడం, వలస, విరపసముద్రం తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారుఈ కార్యక్రమం నందు నడలుడం వలస విరపసముద్రం గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్మాణపు దాత ఆర్. చిత్ర శేఖర్ శివరుద్రప్ప, సర్పంచ్ నాగవేణి జితేంద్ర నాగేంద్రప్ప, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు.. ముప్పు..!

## వైఎస్ఆర్ సీపీ అధికార ప్రతినిధి, ఆనందంగారెడ్డి.

మడకశిర టౌన్ మే 9 ప్రభాతవార్త,



వైసిపి పార్టీ అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి,

విజయవాడ లో సాక్షి ఎడిటర్ ఇంట్లోకి చట్ట విరుద్ధంగా చొరబడి పోలీసులు సోదాలు చేయడం రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ హరిస్తూ పాల్పడుతున్న చర్యలు గా వైఎస్ఆర్సిపి అధికార ప్రతినిధి మాజీ డిసిసి బ్యాంకు ఉపాధ్యక్షులు ఆనందరంగ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వం పోలీసులు వారికి ఏదైనా సమాచారం కావాలన్నా ఏవైనా ఫిర్యాదులు ఉంటే చట్టబద్ధంగా న్యాయస్థానం అనుమతి తో నో, సెర్చ్ వారంటి తోను వెళ్లి సోదాలు చేయవచ్చునని వాటిని పాటించకుండా చట్ట విరుద్ధంగా దౌర్జన్యంగా ఎడిటర్ ఇంటి లోక చొరబడి సోదాలు చేయడం ప్రజాస్వామ్యంలో పత్రిక స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలని ఆయన విమర్శించారు. ఈ చర్యలను ప్రజాస్వామ్య వాదులు ఖండించాలని కోరారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈ విషయంలో జోక్యం చేసుకొని పత్రిక స్వేచ్ఛను కాపాడాలని ఆనంద రంగా రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ప్రేమాభిషేకం నాటక ప్రదర్శనను విజయవంతం చేయండి

## నియోజకవర్గ టిడిపి బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మంజు తారక్

అమరాపురం మే 9 ప్రభాతవార్త



మంజు తారక్ దృశ్యం

మండల పరిధిలోని కనకనపల్లి గ్రామం నందు ఈనెల 11వ తేదీ ఆదివారం రాత్రి ప్రేమాభిషేకం అనే కన్నడ సామాజిక నాటక ప్రదర్శనను చేపడుతున్నట్లు నియోజకవర్గ టిడిపి బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మంజు తారక్తెలిపారు. ప్రముఖ రచయిత కేటీహళ్లి నాగరాజ్ కుటుంబానికి సంబంధించిన భావాలతో రచించినఈ నాటక ప్రదర్శన ద్వారా ప్రజలకు తమ కుటుంబంలో ఎలా మెలగాలి అని సంకేతాన్ని అందించేటువంటి దృశ్యాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కూడా హాజరవుతున్నట్లు అయన తెలిపారు. కళా నాయకుడి పాత్రను తాను పోషిస్తున్నట్లు ఆయన తెలిపారు.యువకులను ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని ప్రోత్సహించాలని ఆయన కోరారు.

# 15న వజ్రకరూరులో 110.67 ఎకరాల ఆలయ భూముల కౌలుకు వేలం

## సమూహ ఆలయాల కార్యనిర్వహణ అధికారి అంగదాల క్రిష్ణయ్య

ఉరవకొండ, మే 9 ప్రభాతవార్త

వజ్రకరూరులో వెలసిన జనార్ధన వెంకటేశ్వరస్వామి, జనార్ధన ఆంజినేయస్వామి, రామేశ్వరస్వామి, చొప్పరం ఆంజినేయస్వామి, చెన్నకేశవ ఆంజినేయస్వామి దేవాలయాలకు చెందిన 110.67 ఎకరాల భూమిని ఏడాదిపాటు కౌలుకు ఇవ్వడానికి ఈనెల 15వ తేదీన గురువారం ఉదయం 11 గంటలకు జనార్ధన వెంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణంలో బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని సమూహ ఆలయాల కార్యనిర్వహణ అధికారి అంగదాల క్రిష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో చెన్నకేశవ, ఆంజినేయస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్ 78లోని 7.98 ఎకరాలు, సర్వే నంబర్ 350 6.77, సర్వే నంబర్ 223, 233 లోని 3.55 ఎకరాలు, చొప్పరం ఆంజినేయస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్లు 158, 161, 296లోని 17.80 ఎకరాలు, రామేశ్వరస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్ 749లోని 12.64 ఎకరాలు, జనార్ధన వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలకు చెందిన సర్వే నంబర్ 38లోని 27.24 ఎకరాలు, సర్వే నంబర్ 30లోని 25.51 ఎకరాలు, సర్వే నంబర్ 279 ఎ1, ఎ2, 279 బిలోని 14.18 ఎకరాల్లో 9.18 ఎకరాలను వేలం వేయడం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనదలచినవారు 1,000 రూపాయలు డిపాజిట్ మొత్తం చెల్లించి వేలంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. వేలం దక్కించుకున్న వారికి 16052025 నుండి 31042026 వరకు ఏడాది కాలానికి కౌలు హక్కులు కల్పించడం జరుగుతుందని ఈవో వివరించారు.

# ఆసుపత్రిలో గర్భవతులకు ఉచిత భోజన సౌకర్యం

గుత్తి, మే 9 ప్రభాతవార్త

గుత్తి ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం న్యాయవాది సోమశేఖర్ ఆధ్వర్యంలో గర్భవతులకు ఉచితంగా పౌష్టిక భోజన సౌకర్యాన్ని కల్పించారు. స్థానిక ఎమ్మెల్యే తల్లి శారదమ్మ మరియు త్రివేణి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని టిడిపి ఆధ్వర్యంలో గత నాలుగు నెలలుగా చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఎల్లప్ప ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.



గర్భవతులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

# శేషవాహనంపై ఊరేగిన శ్రీలక్ష్మీ చెన్నకేశవుడు...!

ధర్మవరం, మే 9(ప్రభాతవార్త)



శేషవాహనంపై పైఊరేగుతున్న చెన్నకేశవుడు

ధర్మవరంలో జరిగే చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరవ రోజు శుక్రవారం సాయంత్రం 3గంటలకు చెన్నకేశవస్వామిని ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి శేషవాహనంపై ఊరేగించారు. పట్టణ పురవీధుల్లో ఉదయం ప్రత్యేకంగా అలంకరించబడిన చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ ఊరేగింపులో చెన్నకేశవునికి అడుగడుగునా భక్తులు పూజలు చేయించి తమ మొక్కులను తీర్చుకున్నారు. రాత్రి 7గంటలకుగజవాహనంపై స్వామివారిని ఊరేగించారు. అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్లపుల్లయ్య శిష్యబృందం అన్నమయ్య నగరసంకీర్తనలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అడహక్ కమిటి చైర్మన్ చెన్నంశెట్టిజగదీశ్, ఈఓవెంకటేశ్వర్లు, అర్చకులు కొనేరాచార్యులు, భానుప్రకాశ్, పాల్గొన్నారు. శని వారంఉదయం మడుగుతేరు, సాయంత్రం 5గంటలకు రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓతెలిపారు.

# ధర్మవరంలో మంత్రిసత్యకుమార్ యాదవ్ నేడు పర్యటన...!

ధర్మవరం, మే9(ప్రభాతవార్త)



మంత్రి సత్య కుమార్ యాదవ్ ఫైల్ ఫోటో

రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రిసత్యకుమార్యాదవ్ శనివారం ధర్మవరంలో పర్యటించనున్నట్టు బీజేపీనాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6 30గంటలనుంచి 8గంటలవరకు నిర్వహించే మడుగు తేరులో పాల్గొంటారన్నారు. 10గంటలకు నుంచి 2గంటల వరకు ఎన్డీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. 3గంటలకు దుర్గమ్మ సర్కిల్లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంబించి సాయంత్రం 5గంటలకు రతోత్సవంలో పాల్గొంటారన్నారు. ఆదివారం ఉదయం 1030గంటలకు బత్తలపల్లిలో తాగునీటి సరఫరా కార్యక్రమాన్ని ప్రారంబిస్తారన్నారు. 11 30గంటలకు మల్లేనిపల్లిలోని మున్సిపల్ వాటర్పంప్హౌస్ను సందర్శిస్తారన్నారు. 1230గంటలకు అయ్యప్పస్వామి ఆలయాన్ని సందర్శిస్తారన్నారు. 1గంటకు ఇందిరమ్మకాలనీలో పలు అబివృద్ధి కార్యక్రమాలు ప్రారంబిస్తారన్నారు. 345 గంటలకు పోతుకుంటలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ ఓ ప్లాంటు ప్రారంబించి అలాగే కొత్తగా నిర్మిం చనున్న పార్కోసం ఏర్పాటుకు భూమిపూజ చేయనున్నారన్నారు. ఈ కార్యక్రమాల అనంతరం తిరిగి విజయవాడకు బయలుదేరి వెళ్తారన్నారు.

# యుద్ధంలో వీరమరణం పొందిన ఇండియన్ ఆర్మీ జవాన్ మురళి నాయక్ పోరాటం చిరస్మరణీయం

## బంజారా సంఘం ప్రతినిధి ఎస్.కె.సుబ్రహ్మణ్యం నాయక్

ఉరవకొండ, మే 9 ప్రభాతవార్త



బంజారా సంఘం ప్రతినిధి ఎస్.కె.సుబ్రహ్మణ్యం నాయక్

ఇండియాపాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో వీరమరణం పొందిన సత్యసాయిజిల్లా గోరంట్లమండలం గడ్డంతండా నివాసి అయినా ఇండియన్ ఆర్మీ జవాన్ ఎం.మురళి నాయక్ చిరస్మరణీ యులని బంజారాసంఘం ప్రతినిధిఎస్.కె. సుబ్రహ్మణ్యంనాయక్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాకిస్తాన్ లోని ఉగ్రవాదులపై ఇండియా చేస్తున్న యుద్ధంలో వీరోచిత పోరాటం చేసి వీరమరణం పొందిన మురళి నాయక్ నిజమైన దేశభక్తుడని కొనియాడారు. దేశం కోసం ప్రాణాలు అర్పించడంలో మేము సైతం ముందుంటామంటూ ఒక బంజారా సమాజానికి చెందిన ఆర్మీ జవాన్ మురళినాయక్ చేసినపోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. యావత్ భారతదేశం ఆయనకు ఘనంగా నివాళులర్పించాల్సిన సమయమిదని అన్నారు.

# మూడు రోజులు పాటుచౌడేశ్వరి దేవి మహా కుంభాభిషేక మహోత్సవాలు

## ఆలయ చైర్మన్ పాటిల్ ప్రకాష్ రెడ్డి

తాడిమర్రి మే 9 (ప్రభాతవార్త )



మండల పరిధిలోని పెద్దకోట్ల గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో నేటి నుండి మూడు రోజుల పాటు మహా కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పాటిల్ ప్రకాష్ రెడ్డి ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి పాటిల్ కపిల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు హోమాలు అభిషేకాలు అర్చనలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# ఘనంగా గోఖలే జయంతి, దుర్గాబాయి వర్ధంతి వేడుకలు

గుత్తి, మే 9 ప్రభాతవార్త



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని పెన్షన్ భవనంలో శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో గోపాల కృష్ణ గోఖలే 164 వ జయంతి, దుర్గాబాయి దేశ్ ముఖ్ 44వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబుబకర్, కుల్లాయి బాబు, షెక్షావలి, నారాయణరెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

అగలి, మే 9 ప్రభాతవార్త



మృతి చెందిన మహిళ

మండలపరిదిలోని మధూడి గ్రామానికి చెందిన సిద్ధగంగమ్మ(45) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఏఎస్ఐ శ్రీరాములు, పిసి శివకుమార్ తెలిపారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలాఉన్నాయి. సిద్ధగంగమ్మ ప్రతిరోజు పొలంలో పూలువిడిపంచడానికి వెళ్లేది శుక్రవారంకూడా పొలంలో పూలువిడిపించి ఇంటికినడుచుకుని వస్తుండగా రంగనాథ్ అనేవ్యక్తి ద్విచక్రవాహనంఎక్కి ఇంటికివస్తుండగా ద్విచక్ర వాహనం మీదనుంచిపడి తీవ్రగాయాలు కాగా వెంటనే మెరుగైన వైద్యం కోసం కర్ణాటక రాష్ట్రం శిర ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ శ్రీరాములు తెలిపారు.

# పార్టీ పటిష్టతకై కార్యకర్తలు కృషి చేయాలి

## మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

పెనుకొండ మే 9 ప్రభాత వార్త



మావటూరు గ్రామంలో పర్యటిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

వైఎస్ఆర్సిపి పార్టీ కోసం కార్యకర్తలు నడం బించాలని మాజీమంత్రి ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మావటూరు గ్రామంలో శుక్రవారం కాఫీవిత్ వైసిపి కార్యకర్తలు కార్యక్రమంలో ఆమెపాల్గొని మాట్లాడారు. క్షేత్రసాయిలో నాయకులు కార్యకర్తలకు అన్నివేళలా అండగా ఉంటానని ఆమె భరోసాఇచ్చారు. కార్యక్రమంలో మండల వైసిపికో కన్వీనర్ చెన్నకేశవులు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉంటూ ప్రజలకు కార్యకర్తలకు అన్నివేళలా అండగాఉండాలని పిలుపునిచ్చారు పార్టీ అధికారంలోకి వచ్చినతర్వాత ప్రతిఒక్కరికి సమచితస్థానం కల్పించడం జరుగుతుంద న్నారు. కార్యక్రమాలలో వైసీపీనాయకులు నాగరాజు,సుధాకర్రెడ్డి పాల్గొన్నారు.

# ఉచిత సామూహిక వివాహాల కార్యక్రమాలను విజయవంతం చేయండి

## మాజీ మంత్రి మాల గుండ్ల శంకర నారాయణ



ఉచిత సామూహిక వివాహాల పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

పెనుకొండ మే 9 ప్రభాతవార్త

మండలంలో పెనుకొండ పావగడ ప్రధాన రహదారి పక్కన ఎల్ జి బి నగర్ సమీపంలో సాయి గీత కన్వెన్షన్ సెంటర్లో ఈనెల 31వ తేదీననిర్వహించే ఉచిత సామూహిక వివాహాలను విజయవంతం చేయాలని మాజీ మంత్రి మాల గుండ్ల శంకరనారాయణ కోరారు. శుక్రవారం కన్వెన్షన్ హాల్లో స్థానిక వైసీపీ నాయకులు తో కలిసి ఉచిత సామూహిక వివాహాల పోస్టర్లను విడుదల చేసిన తదనంతరం ఆయన మాట్లాడారు. కరువు కరాల నృత్యం చేస్తున్న పెనుగొండ నియోజకవర్గంలో ఉచిత సామూహిక కార్యక్రమాలను వైసీపీ నాయకులు రామ్మోహన్ రెడ్డి ఎంపీపీ గీతల ఆధ్వర్యంలో నిర్వహించడం సంతోషదాయకం అన్నారు వివాహాలను పార్టీలకు కులాలకు అతీతంగా నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల పరిధిలోని పేద యువతీ యువకులు పెళ్లిళ్లు చేసుకోవాలని ఆయన కోరారు కార్యక్రమం విజయవంతానికి వైసీపీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలన్నారు వైసీపీ నాయకులు గీతా రామ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన సాయి గీత కన్వెన్షన్ హాలు ఈనెల 31వ తేదీన ప్రారంభించి తదనంతరం వంద పెళ్లిళ్లు ఉచితంగా నిర్వహించాలని నిర్ణయించామని అందుకు ప్రతి ఒక్కరు కార్యక్రమం విజయవంతానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు పేద కుటుంబాలకు చెందిన 18 సంవత్సరాల నిండిన యువతులు ఇరవై ఒక్క సంవత్సరాల నిండిన యువకులు వివాహాలు జరుపుకోవచ్చన్నారు వధూవరులకు నూతన వస్త్రాలు తాళిబొట్టు భోజన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు ఆసక్తి గల యువతీ యువకులు ముందుగా పేర్ల నమోదు చేయించుకోవాలన్నారు కార్యక్రమంలో వైసిపి నాయకులు బి నారాయణ రెడ్డి వెంకటరమణ రాజారెడ్డి శ్రీకాంత్ రెడ్డి కొండల రాయుడు మున్సిపల్ చైర్మన్ ఉమర్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

# అమరుడైన వీర జవాన్ మురళీనాయక్కి మా జోహార్లు



అమరుడైన వీర జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం.

కొత్తచెరువు మే 09 ప్రభాతవార్త.

పాకిస్తాన్ తో జరుగుతున్న యుద్ధంలో అమరుడైన మన తెలుగు జవాన్ మురళి నాయక్ కి కొత్తచెరువు మండల ప్రజలు ఘన నివాళులర్పించారు. సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజవర్గం గోరంట్ల మండలం గడ్డం తండా పంచాయతీ కల్లితండా కు చెందిన 2022 లో అగ్నివీర్ జవాన్ గా చేరిన మురళీ నాయక్ శుక్రవారం రోజు దేశ రక్షణ లో వీర మరణం పొందడం తీవ్ర వేదనను కలిగించింది శుక్రవారం సాయంత్రం 6 .30 గంటల సమయంలో కొత్తచెరువు పట్టణంలో త్రివిధ దళాలకు ఆర్మీ జవాన్లకు సంఘీభావం తెలుపుతూ త్రివర్ణ పతకాలు చేత పట్టుకుని ర్యాలీ నిర్వహించి పాకిస్తాన్ డౌన్, భారత్ మాతాకి జై అమర్ హాయ్ జోహార్ మురళి నాయక్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు అనంతరం నెహ్రూ సర్కిల్ నందు అమరుడైన జవాన్ మురళి నాయక్ చిత్ర పటం ఉంచి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు అమరుడైన వీర జవాన్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని క్యాండిల్ ప్రదర్శన నిర్వహించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలు విడిచిన మురళీ నాయక్ వీర మరణం తెలుగు ప్రజలకే కాక యావత్ దేశ ప్రజలందరికీ స్ఫూర్తి దాయకం భారత్ ,పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో గురతెల్లవారుజామున జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో పాకిస్తాన్ తో జరిగిన యుద్ధం లో మన వీర జవాన్ ప్రదర్శించిన ధైర్యసాహసాలకు భారతీయులందరి తరపున ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ సెల్యూట్ చేశారు. మృతి చెందిన సైనికుడి మురళీ తల్లిదండ్రులకు యావత్ భారత ప్రజలంతా అండగా నిలవాలన్నారు.

# ఫారం పాండ్లపై ప్రత్యేక దృష్టి సారించండి.

## ధర్మవరం డ్వామా ఏపిడి వెంకటాచలపతి.

కనగానపల్లి మే 9 ప్రభాతవార్త



మాట్లాడుతున్న ఏపిడి వెంకటాచలపతి.

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నందు శుక్రవారం ధర్మవరం డ్వామా ఏపీడి వెంకటాచలపతి ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఏపీడి వెంకటాచలపతి మాట్లాడుతూ గ్రామాల్లో ఫారం పాండ్లు త్వరితగతిన పూర్తి చేయాలని అలాగే వర్షాకాలం లోపు పూర్తిచేస్తే నీటి కుంటలో నీరు చేరి రైతులకు బోర్లలో నీళ్లు పుష్కలంగా వస్తాయని సిబ్బంది సమన్వయంతో పని చేయాలని వారిని ఆదేశించారు .అలాగే గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు రవిచంద్ర ముత్యాలప్ప, సుబ్బరాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ లో బిల్లే కాశీపతి, జి.రాజశేఖర్, నాగేంద్ర, రాధాకృష్ణ, శేషు పాల్గొన్నారు.

# వీర జవాన్ మురళి మృతికి నివాళులు

వజ్రకరూరు మే 9 ప్రభాతవార్త



వీర జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రులు

పాకిస్థాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి అశ్రునివాళులు అర్పించారు సీఎం చంద్రబాబు గారు. వీరజవాన్ మురళీనాయక్ ప్రాణాలు కోల్పోవడం తీరని విషాదమన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సీఎంతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు వీరజవాన్కు నివాళులు అర్పించారు.

# చిన్న ముష్టూరులో కిషోరి వికాసం కార్యక్రమం

## హాజరైన ఐసిడిఎస్ ఉరవకొండ ఏసీడీపీఓ ఎల్లమ్మ

ఉరవకొండ, మే 9 ప్రభాతవార్త



చిన్న ముష్టూరులో జరిగిన కిషోరి వికాసం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసిడిపిఓ ఎల్లమ్మ

మండల పరిధిలోని చిన్న ముష్టూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం కిషోరి వికాసం కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉరవకొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఏ సిడిపిఓ ఎల్లమ్మ మాట్లాడుతూ 15 నుండి 18 సంవత్సరాల మధ్య వయసుగల కిషోరి బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. పునరుత్పత్తి, ఆరోగ్యం , బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాల గురించి తెలియజేశారు. బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, ఐరన్, ప్రోటీన్, సి విటమిన్ సమృద్ధిగా ఉండే ఆహారాలను తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా బాల్యవివాహాలు చేసుకోవడం వల్ల అనేక రకాలైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని, చదువు పాడవుతుందని వివరించారు. మాతా, శిశు మరణాలు సంభవించే అవకాశాలు ఉంటాయని తక్కువ బరువుతో బిడ్డ పుట్టడం, పుట్టిన బిడ్డ చనిపోవడం లాంటివి జరుగుతాయన్నారు. ఇలాంటి పరిణామాలు జరగకుండా ఉండాలంటే బాల్య వివాహాలు జరగకుండా చూసే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిరోధక చట్టం గూర్చి సవివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ విజయ కుమారి, జిఎంఎస్ కె.స్వాతి, ఏఎన్ఎం హేమలత, అంగన్వాడీ కార్యకర్తలు సహాయకులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ ఆన్లైన్ ఉచిత కోచింగ్కు దరఖాస్తు చేసుకోండి.

మడకశిర టౌన్ మే 09 ప్రభాతవార్త:

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్షలకు ఆన్లైన్ లో ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సత్యసాయి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిక అధికారిణి నిర్మల జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ లో అర్హత సాధించిన శ్రీ సత్య సాయి జిల్లా వాసులు మాత్రమే ఉచిత ఆన్లైన్ శిక్షణకు అర్హులన్నారు. వెనుకబడిన తరగతులు, ఈ డబ్ల్యూ ఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు తో పాటు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ మార్కుల జాబితాలు జతపరచాలని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ఆన్లైన్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునేవారు టెట్ మార్కుల జాబితా, నేటివిటీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రము, ఆధార్ కార్డు, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటో లు ఈనెల 15 లోపు శ్రీ సత్య సాయి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిక కార్యాలయములో దరఖాస్తు పత్రాలను అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 6301715161 సెల్ ఫోన్ నెంబర్ కు ఫోన్ ద్వారా గాని, మడకశిర బీసీ గర్ల్స్ కాలేజ్ హాస్టల్ సమయములో సంప్రదించాలని వెల్ఫేర్ ఆఫీసర్ సునీత ఒక ప్రకటనలో తెలిపారు.

# నేడు భారత సైనికులకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ

అమరాపురం మే9 ప్రభాతవార్త



టిడిపి మండల కన్వీనర్ గణేష్ దృశ్యం

ఆపరేషన్ సింధూర్తో పాకిస్థాన్కు గట్టిగా బుద్ధి చెప్తూ ప్రాణాలు పణంగా పెట్టి దేశ సత్తా చాటుతున్న భార తసైనికులకు మద్దతుగా మడకశిరలో సంఘీభావ ర్యాలీని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిల ఆధ్వర్యంలో శనివారం 10 గంటలకు ఆర్అండ్బిబంగ్లా నుండి అంబేద్కర్ సర్కిల్వరకు సంఘీభావ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ గణేష్ తెలిపారు. ఈ ర్యాలీకి మద్దతుగా నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి బిజెపి జనసేన నాయకులు కార్యకర్తలతో పాటు యువకులు, మహిళలు, రైతులు, ఉపాధ్యాయ, ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, ప్రతీ కుటుంబం నుండీ పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# మున్సిపాలిటీ హైస్కూల్ పోస్టుల మంజూరుపై హర్షం తెలిపిన ఉపాధ్యాయులు...!



యూటీఎఫ్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ధర్మవరం, మే9(ప్రభాతవార్త)

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) నిరంతర ప్రాతినిధ్యాలు, కృషివల్ల మున్సిపల్ హైస్కూల్లో అప్గ్రేడ్ పోస్టుల మంజూరు అయ్యాయని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం యూటీఎఫ్ ప్రాం తీయకార్యాలయంలో నాయకులు కేక్కట్ చేసి హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేసిన కృషి వల్లనేడు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ హైస్కూల్లో దాదాపు 1800 పోస్టులు హైస్కూల్ హెచ్ఎం, స్కూల్అసిస్టెంట్లుగా అప్గ్రేడ్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమలో యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, జిల్లా మున్సిపల్ సబ్కమిటి కన్వీనర్ బిల్లే రామాంజినేయులు, స్థానిక యూటీఎఫ్నయకులు ఆంజనయ లు,లక్ష్మయ్య, అమర్నారాయణరెడ్డి, సాయిగణేశ్, రామాంజినేయులు, ఆదిశేషు, హరిశంకర్ పాల్గొన్నారు.

09ATP27_09ATP27.qxd 09-05-2025 PM 11:28 Page 1



# దేశ రక్షణ కోసం ఉగ్రదాడిలో... మురళి అమరుడయ్యాడు.

- దేశం గర్వించే బిడ్డను కన్నావు... మేమంతా మీకు అండగా ఉంటాం.
- మురళి కుటుంబాన్ని పరామర్శించిన.... వైసీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీమంత్రి ఉషశ్రీ చరణ్.
- మురళి తల్లిదండ్రులతో ఫోన్లో మాట్లాడి పరామర్శించిన.... మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి




మురళి తల్లిదండ్రులను ఓదారుస్తున్న మాజీ మంత్రి, బాధితులతో ఫోన్లో మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి.

**గోరంట్ల మే 9 ప్రభాత వార్త**

దేశ రక్షణ కోసం ఉగ్రవాదుల వేటలో పాల్గొని మురళి నాయక్ వీరమరణం పొందాడని ఆయన మరణం దేశంమొత్తం చిరకాలం గుర్తు ఉంచుకుంటుందని మాజీమంత్రి ఉషశ్రీచరణ్ అభిప్రాయపడ్డారు. అమ్మ నేను దేశం కోసం పనిచేయాలని ఉంది ఒక్కరోజైనా సైన్యంలో చేరి యూనిఫామ్ వేసుకోవాలని నా కోరిక అని చెప్పి అగ్ని వీర్ లో చేరి దేశ రక్షణ కోసం యుద్ధంలో పాల్గొని ఆఖరికి తల్లిదండ్రుల కడుపుకోత మిగిల్చే విధంగా మాకు దూరమయ్యాడని యుద్ధంలో మృతి చెందిన మురళి నాయక్ తల్లిదండ్రులు మాజీమంత్రి ఉషశ్రీ చరణ్ ముందు కన్నీరు మున్నీరు అయ్యారు. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో గోరంట్ల మండలం కల్లితాండ గ్రామానికి చెందిన వీర జవాన్ మురళీ నాయక్ వీర మరణం పొందడంపై మాజీమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ విచారం వ్యక్తంచేశారు. పాకిస్తాన్ తో జరుగుతున్న యుద్ధంలో గోరంట్ల మండలం కల్లి తాండ గ్రామానికి చెందిన వీర జవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందారు. విషయం తెలుసుకున్న వెంటనే కల్లితాండ గ్రామానికి చేరుకొని మురళీ నాయక్ తల్లిదండ్రులను మాజీ మంత్రి శుక్రవారం పరామర్శించారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న మురళీ నాయక్ తల్లిదండ్రులు శ్రీరాములు నాయక్, జ్యోతిభాయిని చూసి మాజీ మంత్రి భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. దేశం గర్వపడే బిడ్డకు జన్మనిచ్చారని దేశమంతా మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తమ ఏకైక బిడ్డ యుద్ధంలో వీర మరణం చెందడంతో మురళీ నాయక్ తల్లిదండ్రులు శ్రీరాములు నాయక్, జ్యోతిభాయి కడుపు కోత వర్ణాతీతమన్నారు. మురళీ ప్రాణ త్యాగం వృథా కానివ్వబోమని, శత్రువును చిత్తుగా ఓడించి తీరుతామని తెలిపారు. పాకిస్తాన్ జరుగుతున్న ధర్మయుద్ధంలో కేంద్ర ప్రభుత్వానికి, సైనికులకు రాజకీయాలకతీతంటా అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ధర్మం కోసం దేశ సరిహద్దులో జరుగుతున్న పోరాటంలో మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని మాజీ మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. వీర జవాన్ తల్లిదండ్రులు విషాదంలో ఉన్నా తమ బిడ్డ దేశం కోసం ప్రాణాలు అర్పించడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మురళి తల్లిదండ్రులను మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫోను ద్వారా పరామర్శించి వారిలో ఆత్మ ధైర్యాన్ని నింపారు. మీకు అండగా ఉంటామంటూ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి, పట్టణ కన్వీనర్ జిల్లా అధికార ప్రతినిధి మేదర శంకర, జిల్లా ఉపాధ్యక్షులు నార్సింపల్లి రఘురామిరెడ్డి, బాలన్నగారి పల్లి పోతుల రామకృష్ణారెడ్డి, జిల్లా మాజీ స్టీరింగ్ కమిటీ సభ్యులు గంపల రమణారెడ్డి, సర్పంచ్ వాసు నాయక్, జొన్న ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుడు మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరం

- జిల్లా కలెక్టర్ టీఎస్.చేతన్



మురళీనాయక్ మృతిపై మౌనం పాటిస్తున్న జిల్లా కలెక్టర్,జెసి, కలెక్టరేట్ అధికారులు సిబ్బంది

**పుట్టపర్తి (కలెక్టరేట్), మే 9, ప్రభాతవార్త**

పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో దేశసరిహద్దుల్లో మురళీ నాయిక్ ప్రదర్శించిన ధైర్య సాహసాలు దేశానికే కాక రాష్ట్ర ప్రజలందరికీ స్ఫూర్తిదాయకం అని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని వీరజవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఓ విజయసారధి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణలో భాగంగా జరిగిన పోరాటంలో రాష్ట్రానికి చెందిన వీరజవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందారన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, మురళీ నాయిక్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేశం కోసం తన ప్రాణాలను అర్పించిన యువ జవాను మురళీ నాయక్ పేరు చరిత్రపుటల్లో చిరస్మరణీయమైనదిగా నిలిచిపోతుంది. దేశ రక్షణలో ఆయన చూపిన ధైర్యసాహసాలు, పోరాట పటిమకు యావత్ దేశం గర్విస్తోందన్నారు. కొంత సమయం మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలను ఉన్నతాధికారులు కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మురళీ నాయక్ చిత్రపటానికి నివాళులర్పించిన జిల్లా ఎస్పి



మురళీ నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పి వి.రత్న

**పుట్టపర్తి, మే 09, ప్రభాతవార్త**

దేశ సరిహద్దుల్లో వీరమరణం పొందిన మురళీనాయక్ చిత్రపటానికి శ్రీసత్యసాయి జిల్లా ఎస్పి వి.రత్న ఘనంగానివాళులర్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయం నందు వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మురళీనాయక్ మరణం బాధాకరమని, ఆయన ప్రాణ త్యాగం వృద్ధాపో దన్నారు. ఎంద రికో స్ఫూర్తిగా మురళీనాయక్ నిలిచారని కొనియాడారు. వీర జవాన్ మురళీనా యక్ అమర్ రహేహే అంటూ నినాదాలు చేశా రు. ఈ సంద ర్భంగా మురళీ నాయక్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.



మురళీనాయక్ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తున్న జిల్లా ఎస్పి, పోలీస్ అధికారులు, సిబ్బంది

# సమస్యలు పరిష్కరించండి సారూ...!





ముఖ్యమంత్రికి అబ్దుల్ కలాం షాదీఖాన సమస్యలను వివరిస్తున్న మహమ్మద్ రఫీ , ముఖ్యమంత్రికి సమస్యలు విన్నవిస్తున్న ఎస్సి కార్పోరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ , ముఖ్యమంత్రికి వినతిస్తున్న సామకోటి ఆదినారాయణ

**పుట్టపర్తి(కల్చరల్), మే 09, ప్రభాతవార్త**

పుట్టపర్తిలో నెలకొన్ని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, పలువురు నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మొర పెట్టుకున్నారు. ఒక రోజుజిల్లా పర్యాటకు విచ్చేసి ముఖ్యమంత్రిని శ్రీసత్యసాయి విమానాశ్రయం నందు కలుకొని వినతిపత్రాలు సమర్పించుకున్నారు. వీరిలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ముస్లిం మైనారిటీ విభాగపు కార్యదర్శి ఎస్ మహమ్మద్ రఫీ ముఖ్యమంత్రిని కలుసుకొని వినతిపత్రం సమర్పించారు. 2014-19 మధ్య కాలంలో అప్పటి మైనారిటీ శాఖ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కృషితో ఎంతో ఉన్నతాశయంతో అబ్దుల్ కలాం షాదీ మహల్‌కు రూ.1.35 కోట్లు మంజూరు కాగా కోటి రూపాయలతో అబ్దుల్ కలాం షాదీమహల్ భవనం నిర్మించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోక రూ.55 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయకుండా అడ్డుకోవడంతో ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ఈ కారణంగా పుట్టపర్తి నియోజక వర్గం మరియు మున్సిపాలిటీ పరుధిలోని 20 వార్డులు, సమీప గ్రామాల్లోని నిరు పేదలు ఉచితంగా వివాహాలు చేసుకోలేక వేల రూపాయలు ప్రైవేట్ పంక్షన్ హాల్ కి చెల్లించి వివాహాలు చేసుకునే పరిస్థితి నెలకొందని, మీరు దయతలిచి 55 లక్షలు మంజూరు చేసి పేదల కుటుంబాల్లో ఉచిత వివాహాలు చేసుకునే భాగ్యం కల్పించాలని కోరారు. మొత్తం పనులు పూర్తి చేశామని, షాదీమహల్ కి వెళ్లేందుకు సిమెంట్ రోడ్లు, ప్రహరీ నిర్మాణం, స్నానపుగదులు, మరుగుదొడ్లు మరియు భూగర్భ డ్రైనేజ్ పనులు పెండింగ్ లో ఉన్నట్లు తెలియజేశారు. ఇప్పటికే నిధుల అంచనా ప్రతిపాదనలు ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపడం జరిగిందని, పేద కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే షాదీమహల్‌కు నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. అలాగే ఎస్సీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ ముఖ్యమంత్రిని కలుసుకొని మాదిగ, మాదిగ ఉప కులాలు తరఫున ఏబిసిడి వర్గీకరణ చేసి పెద్ద మాదిగ అవుతానన్న మాట నిలబెట్టుకున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. చంద్రబాబు నాయుడుకు మాదిగ మాదిగ, ఉపకులాలు రుణపడి ఉంటాయన్నారు. ఎప్పుడు లేనివిధంగా ఎస్సీ కార్పొరేషన్ ఇచ్చినటువంటి యూనిట్స్‌కు బ్యాక్ అండ్ సబ్సిడీ పెట్టడం ఇబ్బందిగా ఉందని, అదేవిధంగా అత్యంత కరువు వెనకబడినటువంటి ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక నిధుల కేటాయించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించే విధంగా మరియు ఎస్సీ రైతులకు సబ్సిడీ రూపంలో రాయితీలు కల్పించాలని నూతనంగా ఏర్పడిన శ్రీ సత్య సాయి జిల్లాలో అంబేద్కర్ భవన్ ఐదుఎకరాల భూమి మరియు సుశాలమైన భవంతి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, జిల్లా నడిబొడ్డులో ఎస్సీ కాంప్లెక్స్‌కు స్థలం కేటాయిస్తూ నిధులు మంజూరు చేయాలని పుట్టపర్తిలో, అంబేద్కర్ గురుకుల, ప్రభుత్వజూనియర్, డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయాలని, ఉమ్మడి అనంతపురం జిల్లా సత్యసాయి జిల్లా ఎస్సీ అభివృద్ధి సంక్షేమ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతిపత్రం సమర్పించారు. అలాగే తెదేపా జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ముఖ్యమంత్రినికలుసుకొని పలు సమస్యలు పరిష్కరించాలని వినతించారు. వీరితోపాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు ముఖ్యమంత్రి కలుసుకొని తమ సమస్యలను ఎకరువు పెట్టారు. వీరి సమస్యలను సావధానంగా అలకించిన ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడం జరిగింది.

# హంద్రీనీవా కాలువలుపై సిఎం అరాపై హర్షం

**అమరాపురం మే9 ప్రభాతవార్త**



యువరైతు

అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హంద్రీనీవా కాలువల పరిశీలన నిమిత్తం విచ్చేయడం విధితమే. అందులో భాగంగా మడకశిర నియోజకవర్గం అమరాపురం అగలి మండలాల వరకు హంద్రీనీవా పనుల మ్యాప్ ను ఇరిగేషన్ అధికారుల ద్వారా పరిశీలిస్తూ మడకశిర బార్డర్ ఏరియా అమరాపురం మరియు ఆగలి ప్రాంతాలకు పనులను సత్వరమే పూర్తి చేయాలని సీఎం ఆదేశించడం పట్ల టిడిపి యువ రైతు నాయకుడు నాగోనపల్లి మంజునాథ్ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగాఈ ప్రాంతాల్లో వక్క మరియు తమలపాకు తోటలు అధికంగా ఉండటం ద్వారా పనులు పూర్తి అయితే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ల ఆధ్వర్యంలో పనులు పూర్తి అవుతుందని ఆయన పేర్కొన్నారు.

# మే 11వ తేదీన కళ్యాణదుర్గం ప్రభుత్వ ఉద్యోగ సంఘం ఎన్నికలు

**కళ్యాణదుర్గం, మే 9 ప్రభాతవార్త :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కళ్యాణదుర్గం శాఖ ఎన్నికలను ఈనెల 11వ తేదీన ఆదివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు గోపికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల అధికారులుగా వేణుగోపాల్ సహాయ ఎన్నికల అధికారిగా కెసి నాగరాజులను నియమించినట్లు తెలిపారు. ఈ ఎన్నికలను కళ్యాణదుర్గం పట్టణంలోని జ్యోతిర్మయి బాలికల జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కనుక కళ్యాణ్ దుర్గం తాలూకా ఉద్యోగ ఉపాధ్యాయ ఉద్యోగులందరూ ఎన్నికలలో పాల్గొనాలని తాలూకా అధ్యక్షులు వార్డెన్ నాగరాజు విజ్ఞప్తి చేశారు.

# ఆకుతోటపల్లి గ్రామంలో వీది నాటకము ద్వారా హెచ్.ఐ.వి /ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం

**అనంతపురం కల్చరల్ మే 09 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశముల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో తరిమెల రాజు కళా బృందంతో వీధి నాటకముల ద్వారా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై అవగాహనకార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమములో భాగముగా శుక్రవారం అనంతపురం జిల్లా ఆకుతోటపల్లి గ్రామంలోని బస్‌స్టాండ్ నందు వీది నాటకము ద్వారా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధ ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజములో కలసి జీవించాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ క్షయవ్యాధి సంబందం గూర్చి, సుఖవ్యాధులు మరియు చికిత్స గూర్చి,కండోమ్ యొక్క ఉపయోగము గూర్చి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఏక్ట్ 2017 గూర్చి ప్రజలలో తరిమెల రాజు కళా బృందం వారు చక్కగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ డీ.ఆర్.పి. రమేష్ యాదవ్,జోనల్ సూపర్వైజర్ శ్రీరాములు,లింక్ వర్కర్ స్వప్న మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి చేర్పులు, మార్పులు, తొలగింపులకు మంచి అవకాశం

**అగళి, మే 9 ప్రభాతవార్త**

గత వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వంలో ఎంతో మంది పేద ప్రజలు రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోవడంతోపాటు ఉన్న రేషన్‌కార్డులో పేర్లు తొలగింపు, పేర్లు చేర్చుటకు దరఖాస్తు చేసుకున్నారు. సంవత్సరం కొద్ది అనుమతుల కోసం వేచి చూశారు కానీ అనుమతులు రాకపోవడంతో ఎన్నోసార్లు సచివాలయాల చుట్టూ, సచివాలయాల చుట్టూ తిరిగి నిరాశ చెందారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున కొత్త రేషన్‌కార్డులకు, కొత్తగా పెళ్లైన వారు దరఖాస్తు చేసుకోవడానికి, కొత్తగా చేర్చాల్సిన వారిని, కార్డులో వారిని తొలగించడానికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందుకే పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు సుబ్బారావు, ఆర్ఐ చంద్రశేఖర్‌రావు తెలిపారు.

# 10న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుత్తి తాలూకా ఎన్నికలు

**గుత్తి, మే 9 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుత్తి తాలూకా లో ఆ సంఘ ఎన్నికలు ఈనెల 10వ తేదీన నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గోపికృష్ణ గుత్తి తాలూకా అధ్యక్షులు డాక్టర్ యల్లప్ప లు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. ఎన్నికల నిర్వహణ అధికారిగా జిల్లా సహాధ్యక్షులు వేణుగోపాల్ , సహాయ ఎన్నికల అధికారిగా జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి కేసీ నాగరాజును నియమించడం జరిగింది. ఈ ఎన్నికలు గుత్తి లోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సాయంకాలం 4 గంటలకు జరుగునని ఆసక్తిగల ఉద్యోగ ఉపాధ్యాయులు ఈ ఎన్నికలలో పాల్గొనాలని వారు కోరారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే జె.సి అష్మిత్ రెడ్డి, చైర్మన్ జె.సి ప్రభాకర్ రెడ్డి



ముఖ్యమంత్రి చంద్రబాబును సత్కరిస్తున్న జె.సి అష్మిత్ రెడ్డి, జె.సి ప్రభాకర్ రెడ్డిలు

**తాడిపత్రిటౌన్, మే 9 ప్రభాతవార్త:**

అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గ పర్యటనలో భాగంగా జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును చాయాపురం గ్రామ సమీపంలోని హెలీపాడ్ వద్ద తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి అష్మిత్ రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జె.సి ప్రభాకర్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని వారు దుస్సాలువాతో సత్కరించి జ్ఞాపికను అందచేసి నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రాన్ని అందచేశారు.

# 10న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాడిపత్రి తాలూకా ఎన్నికలు

**తాడిపత్రిటౌన్, మే 9 ప్రభాతవార్త:**

ఈ నెల 10వతేదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాడిపత్రి తాలూకా లో ఆ సంఘ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గోపికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇందులో భాగంగా ఎన్నికల నిర్వహణ అధికారిగా జిల్లా సహాధ్యక్షులు వేణుగోపాల్ , సహాయ ఎన్నికల అధికారిగా జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి కేసీ నాగరాజును నియమించడం జరిగిందన్నారు. ఈ ఎన్నికలు తాడిపత్రి లోని స్థానిక రైతు సేవా కేంద్రం, తిప్పారెడ్డిపల్లి, కర్నూలు వెంచర్ లో ఉదయం 10 గంటలకు జరుగుతాయన్నారు. ఆసక్తిగల ఉద్యోగ ఉపాధ్యాయులు ఈ ఎన్నికలలో పాల్గొనాలని ఆయన కోరారు.

# వివాహానికి హాజరైన ఎమ్మెల్యే జె.సి



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే జె.సి. అష్మిత్ రెడ్డి

**తాడిపత్రిటౌన్, మే 9 ప్రభాతవార్త**

పట్టణంలోని మెయిన్‌బజారులో ఉన్న ఆర్‌వి స్వామి కళ్యాణమండపంలో జరిగిన వివాహ వేడుకకు ఎమ్మెల్యే జె.సి అష్మిత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులు కళ్యాణ్ చక్రవర్తి, దేవిక లను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు వున్నారు.

# గోసువారి వివాహ వేడుకకు హాజరైన ప్రముఖులు

**తాడిపత్రిటౌన్, మే 9 ప్రభాతవార్త**



పట్టణంలోని పుట్లూరు రోడ్డులో ఉన్న ఏఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరిగిన వైకాపా నాయకుడు ఆలూరు రాజగోపాల్ రెడ్డి కుమార్తె వివాహ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ వివాహ వేడుకకు జమ్మలమడుగు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి, వైకాపా అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి భార్య సుప్రియ, తల్లి కళావతి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చిన్న కుమారుని భార్య మోనామృత రెడ్డి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి రమేష్ రెడ్డి, పేరం స్వర్ణలత, మాజీ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు సూర్యముని, గోపాల్ రెడ్డి, బార్ బాబు, చింబిల్లి రమణ, వైకాపా నాయకులు,టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం లబ్దిదారులకు ప్రయోజనం



బ్యాంకు రీజనల్ మేనేజర్ ను సన్మానిస్తున్న బిజెపి నాయకులు

**అమడగూరు, మే 9 ప్రభాతవార్త**

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా లబ్దిదారులు ప్రయోజనం పొందుతున్నారని బిజెపి నాయకులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద లబ్ధిదారులకు లోన్లు మంజూరు చేసినందుకు గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రమేష్ ను బీజేపీ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ స్టేట్ కన్వీనర్ చింత శరత్ కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు ఇందుకూరు సురేందర్ రెడ్డి, సుబ్బరాజు, రామాంజనేయులు, పరమేశ్వర్ రెడ్డి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని సాంప్రదాయ వృత్తిదారులకు ఆర్థికంగా అండగా ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. ప్లంబర్లు, కార్పెంటర్లు, బడుగు బలహీన వర్గాల వృత్తిదారులు ఈ పథకం ద్వారా మద్దతు పొందవచ్చన్నారు. అలాగే ప్రధానమంత్రి సూర్య గర్ పథకం కూడా గ్రామీణ ప్రాంతాల్లో సాధారణ కుటుంబాలకు విద్యుత్ భద్రతను అందిస్తోందన్నారు. ఈ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. విశ్వకర్మ యోజన కింద రీజనల్ పరిధిలోని సుమారు 57 బ్యాంకుల లో 1651 మంది లబ్ధిదారులకు విశ్వకర్మ యోజన ద్వారా లోన్లు మంజూరు అయినట్లు తెలిపారు. సాంప్రదాయ వృత్తిదారులకు గుర్తింపు, అవసరమైన పనిముట్లు కొనుగోలుకు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. శిక్షణ మరియు మార్కెట్ లింకేజెస్, గౌరవవేతనం మరియు మైక్రో ఫైనాన్స్ సదుపాయాలు ఈ పథకాలను గ్రామీణ బ్యాంకుల ద్వారా సులభంగా పొందవచ్చని, ప్రజలు వాటి గురించి తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నేతలు పిలుపునిచ్చారు.

# జవాన్ మురళి నాయక్ త్యాగం మరువలేనిది

**ఉమ్మడి అనంతపురం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు టిసి వరుణ్**

**అనంతపురం వైద్యం, మే 9 ప్రబాత వార్త**

భారత సరిహద్దులలో యుద్ధం లో భాగంగా ప్రాణాలు కోల్పోయిన జవాన్ మురళి నాయక త్యాగం మరువలేనిదని అని ఉమ్మడి అనంతపురం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు వరుణ్ అన్నారు. జవాన్ మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఈ సందర్భంగా జవాన్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు

# సమాచార హక్కు చట్టం పరిరక్షణ పై సమావేశం

**అనంతపురం వైద్యం మే9 ప్రభాతవార్త**

సమాచార హక్కు చట్టం పరిరక్షణపై ఈనెల 11వ తేదీన హౌసింగ్ బోర్డు లోని విద్యుత్ కళావేదికలో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వీర్యం అయిపోతున్న సమాచార హక్కు చట్టాన్ని కాపాడాలని, సమాచార హక్కు చట్టాన్ని సక్రమంగా అమలు పరచుటకు ఆర్టిఐ కార్యకర్తలు యాక్టివిస్టులు ప్రతి ఒక్కరు నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సమాచార హక్కు చట్టం వచ్చి దాదాపుగా 20 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వ కార్యాలయంలో అధికారులకు చట్టం గురించి సరైన అవగాహన లేకపోవడం బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమానికి ఉద్యమకారులు ప్రజా సంఘాలు విద్యార్థి సంఘాలు మహిళా సంఘాలు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

# బండిశూల ఊరేగింపులో పాల్గొన్న జె.సి

**పెద్దవడుగూరు, మే 9 ప్రభాతవార్త**



మండలంలో బండి శూల తిరుణాల సందర్భంగా శుక్రవారం పెద్దవడుగూరు, చిన్నవడుగూరు గ్రామాల నుండి సుడిబండిని లాగేందుకు వృషభాలు వెళ్తుండగా ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపు కార్యక్రమానికి తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జే.సీ ప్రభాకరరెడ్డి హాజరై ప్రజలను ఉత్సాహపరిచారు. డప్పులు, డిజేలతో గ్రామంలో మారుమోగగా ప్రజలను చూసి జే.సీ మరింత ఉత్సాహంగా నృత్యాలు చేసి పలువురిని అశ్చర్య పరిచారు. చిన్నవడుగూరు రోడ్డు నుండి అంబేద్కర్ కూడలి వరకు ఊరేగింపు ర్యాలీ కార్యక్రమం నిర్వహించగా ఎలాంటి సంఘటనలు జరగకుండా సీఐ రామసుబ్బయ్య, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాల ఎస్సైలు ఆంజనేయులు, నాగేంద్రప్రసాద్, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఊరేగింపు కార్యక్రమం చేపట్టగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన తెదేపా శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

